సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



రూ. 3.65 లక్షల విరాళం


ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు అలుమోలు సుబ్బారావు (ఫైడిపర్రు) గురువారం రూ.3,65,000 విరాళంగా అందజేశారు.



అన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి గురువారం తాతబ్బాయి(సామర్లకోట), గుళ్ల బ్రహ్మం కుటుంబ సభ్యులు (గోపాలపట్నం) రూ.1,00,116 చొప్పున సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325 ,పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.25 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్‌

ఐఏఎస్‌ శిక్షణకు జేసీ తేజ్‌భరత్‌

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): **తూర్పుగో**దావరి జిల్లా జాయింట్‌ కలెక్ట**ర్‌ తేజ్‌ భరత్‌** ఐఏఎస్‌ శిక్షణ కోసం ముస్సోరి **వెళ్లారు. నెల** రోజులు పాటు శిక్షణ పొందు**తారు. అనం**తరం ఆయన తిరిగి విధుల్లో చేర**నున్నారు.**

గణిత క్యాలెండర్‌ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో అబ్రహం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం సిటీ): రాష్ట్ర ఏపీ మ్యాథ్స్‌ ఫోరమ్‌ తయారు చేసిన గణిత క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌.అబ్రహం గురువారం ఆవిష్కరించారు. ప్రతినెలా ఒక్కొక్క గణిత సంఖ్యలను పరిచయం చేస్తూ పన్నెండు నెలలు ఈ క్యాలెండర్‌ను రూపొందించినట్టు ఆ ఫోరమ్‌ ఉపాధ్యక్షురాలు మేకా సుసత్యరేఖ తెలిపారు. విద్యార్థులకు ఈ క్యాలెండర్‌ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్‌ గురయ్య, కరస్పాండెంట్‌ శ్యామ్‌సుందర్‌, డీవైఈవో తిరుమలదాస్‌, డీఐ బి.దిలీప్‌కుమార్‌ పాల్గొన్నారు.

స్కానింగ్‌ సెంటర్లపై నిఘా ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్‌ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్‌: గర్భస్థ లింగ నిర్ధారణ తెలియజేస్తున్న స్కానింగ్‌ సెంటర్లను గుర్తించి, వాటిపై డెకాయ్‌ ఆపరేషన్‌ నిర్వహించి గట్టి నిఘా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్‌ కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గురువారం సీసీపీఎన్‌డీటీ యాక్ట్‌, గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం అమలులో భాగంగా జిల్లాస్థాయి సలహా సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్‌ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్కానింగ్‌ సెంటర్లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. లింగ నిష్పత్తి 600 కంటే తక్కువ ఉన్న మండలాల్లో పర్యవేక్షణ చేసి తగిన కారణాలు తెలుసుకోవాలని, అబార్షన్‌ రేటు ఎక్కువగా ఉన్న ఆస్పత్రులను తనిఖీలు చేయాలన్నారు. సచివాలయాలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగే సమావేశాల్లో లింగనిర్ధారణ చట్టం అమలుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో గైనకాలజిస్ట్‌ డాక్టర్‌ శైలజ, పీడియాట్రీషియన్‌ డాక్టర్‌ నాయకర్‌, డాక్టర్‌ శ్రీవల్లి, డాక్టర్‌ మౌనిక, డెమో ఇన్‌చార్జి ఎన్‌.సత్యకుమార్‌ పాల్గొన్నారు.

సుస్థిర లక్ష్యాల సాధనకు ప్రాధాన్యం

కార్పొరేషన్‌ కమిషనర్‌ దినేష్‌కుమార్‌



సమీక్షలో పాల్గొన్న కార్పొరేషన్‌ కమిషనర్‌ దినేష్‌ కుమార్‌

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): మాతా,శిశు సంరక్షణ, ఉగాదికి ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను సాధించడానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్టు కార్పొరేషన్‌ కమిషనర్‌ దినేష్‌కుమార్‌ తెలిపారు. రీసర్వే, జాతీయ రహదారుల భూసేకరణ, స్పందన గ్రీవెన్స్‌, వ్యవసాయశాఖ, ఉద్యానవన, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్‌, పంచాయతీరాజ్‌ శాఖల ద్వారా చేపట్టి అమలు చేస్తున్న లక్ష్యాల పురోగతిపై గురువారం వెలగపూడి నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్‌ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. కలెక్టరేట్‌లో కార్పొరేషన్‌ కమిషనర్‌ కె.దినేష్‌ కుమార్‌ కలెక్టర్‌ తరపున హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలు, సచివాలయం ద్వారా అందించే పౌర సేవల సామర్థ్యం నూరు శాతం ప్రగతి లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రీసర్వేకి సంబంధించి 269 గ్రామాలకుగాను డ్రోన్‌ ఫ్లైయింగ్‌ గతవారం 131, ఈ వారం 18.. మొత్తం 149 చేశామన్నారు. ఉగాదికి జిల్లాలో 18,273 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా.. ఇప్పటి వరకూ 13,664 పూర్తి చేసినట్టు తెలిపారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం కోసం 37 హెక్టర్ల ప్రభుత్వ, 33 హెక్టర్ల ప్రైవేట్‌ భూమి సేకరణ చేస్తున్నట్లు వివరించారు. నూతనంగా జిల్లాకు కేటాయించిన 59 లక్షల పనిదినాలకుగాను 74 శాతం ప్రగతి సాధించామన్నారు.

వరి..దిగుబడుల సిరి

- అసాధారణంగా ధాన్యం దిగుబడులు
- ఐదేళ్లల్లో ఎన్నడూ లేని విధంగా నమోదు
- ఏడాదిలోనే 5 బస్తాల పెరుగుదల
- ప్రభుత్వ ప్రోత్సాహాలతో సత్ఫలితాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతులు



సాక్షి, రాజమహేంద్రవరం: జలాశయాల్లో పుష్కలంగా నీరు.. సీజన్‌కు ముందుగానే బ్యారేజీ నుంచి సాగునీటి విడుదల.. మూడు పంటల దిశగా ప్రభుత్వ సన్నద్ధత.. సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అందజేత.. ఆపై వరుణుడి కరుణ. ఇలా ఖరీఫ్‌ సీజన్‌ ఆరంభం నుంచి అనుకూల పవనాలు వీడయంతో ఈ ఖరీఫ్‌లో రికార్డు స్థాయి వరి దిగుబడులు అందాయి. గత ఐదేళ్లతో పోల్చితే అత్యధిక దిగుబడులు నమోదయ్యాయి. ఈ పరిణామం కర్షకులకు ఎంతగానో ఉపకరిస్తోంది. జిల్లాలో 2021 ఖరీఫ్‌లో 82,695 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఎకరానికి (75 కిలోల బస్తా) 28 బస్తాల ధాన్యం దిగుబడి వస్తే.. 2022 ఖరీఫ్‌లో 73,606 హెక్టార్లలో వరి సాగైంది. ఎకరానికి 33 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. ఏడాది వ్యవధిలో ఎకరం పొలానికి 5 బస్తాలు వృద్ధి చెందింది. అంతకుముందు ఖరీఫ్‌లో 4,29,990 మెట్రిక్‌ టన్నుల ధాన్యం దిగుబడి అందితే.. ఈసారి 4,52,368 మెట్రిక్‌ టన్నులు.. అంటే 22,378 మెట్రిక్‌ టన్నులు అదనంగా దిగుబడి వచ్చింది. గత ఐదేళ్లుగా ఇలాంటి దిగుబడులు ఎప్పుడూ నమోదు కాలేదని వ్యవసాయ శాఖ చెబుతోంది.

అనుకూలించిన వాతావరణం

2021 ఖరీఫ్‌తో పోలిస్తే.. 2022 ఖరీఫ్‌కు వాతావరణం అనుకూలించింది. పంట సాగు సమయంలో వర్షాలు సంవృద్ధిగా పడ్డాయి. అప్పటికి జిల్లా సాధారణ సగటు వర్షపాతం 717.8 మి.మీటర్లుకాగా.. 839.2 మి.మీటర్లు నమోదైంది. 13.0 శాతం వర్షపాతం అధికంగా నమోదైంది.

- ఏటా మూడు పంటల సాగు ప్రోత్సహించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. అందుకు అనుగుణంగా 2022 ఖరీఫ్‌లో జూన్‌ 1 నుంచి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. సాధారణంగా జూన్‌ 11న విడుదల చేయాల్సి ఉండగా.. పది రోజుల ముందుగా సర్‌ ఆర్థర్‌ కాటన్‌ బ్యారేజీ నుంచి నీటిని విడుదలకు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా ప్రకృతి విపత్తులు, గోదావరి వరద నుంచి పంటను గట్టెక్కించుకునే అవకాశం కలిగింది.
- మొక్కలు ఆహారాన్ని తయారుచేసుకుని ఏపుగా పెరిగి మంచి దిగుబడులు రావాడానికి కిరణ జన్య సంయోగక్రియ బాగా ఉపకరిస్తుంది. సూర్యుని వెలుగు ఎక్కువ సమయం ఉంటే మొక్కలకు అంత అనుకూలం. సెప్టెంబర్‌ అనంతరం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాధారణంగా 30 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సగటున రెండు డిగ్రీల దాదా అధిక వేడి నెలకొంది. ఫలితంగా పైరు బాగా కుదురుకుని ఏపుగా పెరిగి దిగుబడులు పెరిగేందుకు దోహదపడింది.
- సాగుకు అవసరమైన సమయంలో ప్రభుత్వం విత్తనాలు సబ్సిడీపై అందజేసింది.
- దిగుబడిలో కీలక భూమిక పోషించే ఎరువులను సీజన్‌ ప్రారంభానికి ముందే ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచింది.
- జిల్లాలో వ్యవసాయం మీద ఆధారపడిన రైతులు 2,18,171 మంది ఉన్నారు. వీరికి పంట సాగుకు అవసరమైన పెట్టుబడులను రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం అందజేయడంతో కర్షకుల్లో ఉత్సాహం నెలకొని కాడిపడ్డారు.

తెగుళ్ల బెడద దూరం

ఏటా పంటలకు విపరీతమైన తెగుళ్లు ఆశించేవి. ఈ ఏడాది ఖరీఫ్‌లో తెగుళ్ల బెడద నుంచి రైతులకు ఉపశమనం కలిగింది. ప్రధానంగా ఆకు చుట్టు పురుగు బెడద పెద్దగా కనిపించలేదు. వెద్ద పద్ధతిలో సాగు చేయడంతో పంటకు ఎలుకల బెడద దూరమైంది. ఇలా ప్రతి అంశం రైతులకు అనుకూలంగా ఉండటంతో పంట దిగుబడి సైతం ఆశించిన మేర అందిందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

ఖరీఫ్‌లో మండలాల వారీగా దిగుబడులు (బస్తాల్లో)...

మండలం	2021	2022	వ్యత్యాసం
రాజానగరం	30	40	10
కోరుకొండ	27	35	10
గోకవరం	31	34	3
తాళ్లపూడి	31	36	5
దేవరపల్లి	29	36	7
సీతానగరం	34	36	2
నిడదవోలు	20	35	15
కొవ్వూరు	29	35	6
నల్లజర్ల	32	34	2
రంగంపేట	29	34	5
గోపాలపురం	32	34	2
ఉండ్రాజవరం	25	32	7
చాగల్లు	32	31	1
బిక్కవోలు	23	28	5
అనపర్తి	20	27	7
కడియం	22	26	4

రైతులకు ఉపయుక్తం



ఖరీఫ్‌-2022 దిగుబడులు ఘనంగా ఉన్నాయి. ప్రతి మండలంలో 2021 ఖరీఫ్‌, 2022 ఖరీఫ్‌కు వ్యత్యాసం కనిపించింది. ఇందుకు ముందస్తుగా సాగునీరు అందించడం. ఎంతగానో దోహద పడింది. ప్రతి ఎకరానికి అదనంగా ధాన్యం అందడంతో రైతులకు ఆర్థిక ప్రయోజనం కలిగింది. పెట్టిన పెట్టుబడులు తిరిగి దక్కడంతో పాటు లాభాలు చూశారు. ఈ పరిణామం రైతుల్లో రబీ సాగుకు ముందుకు వచ్చేలా చేసింది. రబీ సకాలంలో పూర్తయితే.. మూడో పంటకు అవకాశం ఉంటుంది. మినుములు, పెసలు లాంటి ఆరుతడి పంటలు పండించుకునే వెసలుబాటు దొరుకుతుంది.

\- ఎస్‌.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో పనుల పరిశీలన



ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీని పరిశీలిస్తున్న డాక్టర్‌ చెరుకూరి శ్రీధర్‌

గోకవరం: పోలవరం నిర్వాసితుల కోసం నిర్మిస్తున్న ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో పనులు నాణ్యతతో చేపట్టాలని ఆర్‌అండ్‌ఆర్‌ కమిషనర్‌ డాక్టర్‌ చెరుకూరి శ్రీధర్‌ అధికారులను ఆదేశించారు. గోకవరంలో దేవీపట్నం ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరిగిన పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను మరింత నాణ్యతతో చేపట్టాలన్నారు. నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. . ఈ సందర్భంగా కాలనీవాసులు కమిషనర్‌ని కలిశారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకునేవారికి నీరు, విద్యుత్‌ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకునేవారికి ఇసుక కూపన్లు అందిస్తామన్నారు. ఆయన వెంట పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌ ప్రవీణ్‌ ఆదిత్య, రంపచోడవరం సబ్‌కలెక్టర్‌ శుభంబన్సాల్‌, దేవీపట్నం తహశీల్దార్‌ రామకృష్ణ, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఉన్నారు.

సర్పవరం జంక్షన్‌లో 25 అడుగుల శివలింగం

కాకినాడ రూరల్‌: మహా శివరాత్రి సందర్భంగా బ్రహ్మకుమారీల ఆధ్వర్యాన కాకినాడ సర్పవరం జంక్షన్‌ వద్ద 25 అడుగుల శివలింగాన్ని ఏర్పాటు చేశారు. 87వ త్రిమూర్తి శివ జయంతి సందర్భంగా భక్తులకు పరమపిత శివ భగవానుని స్వర్ణలింగ దివ్య దర్శనం కల్పించామని బ్రహ్మకుమారీ సర్పవరం జంక్షన్‌ శాంతిధామ్‌ ఇన్‌చార్జి సిస్టర్‌ రజని తెలిపారు. ఆమె, కౌడా చైర్‌పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు గురువారం రాత్రి జ్యోతి ప్రజ్వలన చేసి శివరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు.

చంద్రబాబువి మోసపూరిత వ్యాఖ్యలు

- ఆయన పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం
- ఎంపీ భరత్‌రామ్‌ ధ్వజం



రాజమహేంద్రవరం రూరల్‌: మోసపూరిత వ్యాఖ్యలను మానుకోవాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు వైఎస్సార్‌ సీపీ పార్లమెంటరీ చీఫ్‌ విప్‌, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌ రామ్‌ హితవు పలికారు. నవ్యాంధ్ర ప్రదేశ్‌కు తొలి ముఖ్యమంత్రిగా ఆయనకు ప్రజలు పట్టం కడితే రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముంపు మండలాలు ఏడింటినీ ఏపీలో కలిపితేనే 2014లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని చంద్రబాబు అనడాన్ని ఖండించారు. అలా అయితే ప్రత్యేక హోదా ఇచ్చాకనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని పట్టు పట్టవచ్చు కదా అన్ని ప్రశ్నించారు.

లోకేష్‌ నోరు అదుపులో పెట్టుకో

సీఎం జగన్‌పై లోకేష్‌ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఎంపీ భరత్‌రామ్‌ ఖండించారు. కర్నాటక వెళ్లి అమ్మఒడి వచ్చిందా అని అడగడమే ఆయనకు తెలుసన్నారు. లోకేష్‌ నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు.

ఏపీపై కేంద్రానికి సవతి తల్లి ప్రేమ

మన రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని, బడ్జెట్‌లో ఒక్క పోలవరం ప్రాజెక్టుకు అరకొర నిధులు తప్పిస్తే మొత్తానికి మొండి చేయి చూపించిందని ఎంపీ మార్గాని భరత్‌ రామ్‌ విమర్శించారు. తమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు కేంద్రంతో ఎంతో సయోధ్యగా ఉన్నా, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. పార్లమెంట్‌లో మన ఏపీ ఎంపీల సంఖ్య చాలా తక్కువే అయినా మన రాష్ట్ర సమస్యలను వినిపించడంలో స్వరం పెద్దదేనని అన్నారు. రాజ్యసభలో విజయసాయిరెడ్డి, లోక్‌సభలో మిథున్‌రెడ్డి సారథ్యంలో అవకాశం వచ్చినప్పుడల్లా కేంద్రాన్ని నిలదీస్తూనే ఉన్నామని గుర్తుచేశారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర తెలికులగాండ్ల కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ సంకిన భవానీ ప్రియ, రాష్ట్రఖాదీబోర్డు వైస్‌ చైర్మన్‌ పిల్లి నిర్మల, మాజీ ఫ్లోర్‌లీడర్‌ పోలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి విద్యా,వైజ్ఞానిక ప్రదర్శన

రాష్ట్రస్థాయికి 10 ప్రాజెక్టుల ఎంపిక



విజేతలతో జిల్లావిద్యాశాఖాధికారి ఎస్‌.అబ్రహం తదితరులు

రాజమహేంద్రవరం రూరల్‌: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆల్కాట్‌తోటలోని శ్రీసత్యసాయి గురుకులం ఉన్నతపాఠశాలలో రెండురోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి విద్యా–వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ముగిసింది. ఈసందర్భంగా జరిగిన సభలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌.అబ్రహం మాట్లాడుతూ విద్యా–వైజ్ఞానికప్రదర్శనకు వేదిక ఇచ్చిన సత్య సాయి గురుకులం యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. గురుకులం కరెస్పాండెంట్‌ శ్యాం సుందర్‌ మాట్లాడుతూ విద్యాశాఖ కార్యక్రమంలో పాలు పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. న్యాయనిర్ణేతగా లెక్చరర్‌ మల్లికార్జున్‌ వ్యవహరించారు. జిల్లా సైన్స్‌ అధికారి జీవీఎస్‌ఎస్‌ నెప్రూహ నివేదిక అందచేశారు.

ఉత్తమ ప్రాజెక్టుల ఎంపిక

జిల్లాస్థాయిలో ప్రదర్శించిన 95 ప్రాజెక్టుల్లో ఐదు అంశాలలో ఉత్తమమైన 10 ఎగ్జిబిట్స్‌ను ఎంపిక చేశారు. వీటిని ఈనెల 27,28 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రం, మెడల్‌తోపాటు పాల్గొన్నవారందరికీ పార్టిసిపేషన్‌ సర్టిఫికెట్లను డీఈవో, గురుకులం కరస్పాండెంట్‌ శ్యాంసుందర్‌, డివిజన్‌ ఉప విద్యాశాఖాధికారి తిరుమలదాస్‌, అర్బన్‌ రేంజ్‌ డీ ఐ దిలీప్‌ కుమార్‌, రూరల్‌ ఎంఈవో ఎ. దుర్గా తులసీదాస్‌ ,శ్రీ సత్య సాయి గురుకులం ప్రిన్సిపాల్‌ కె.గురవయ్య తదితరులు అందజేశారు.

విజేతలు వీరే...

గణిత భావన మోడల్స్‌ విభాగంలో డి.భావనసింధు (మున్సిపల్‌ కార్పొరేషన్‌ హైస్కూల్‌,లాలాచెరువు) ప్రథమ, వి.చరణ్‌సాయి (జెడ్పీహెచ్‌ఎస్‌,అన్నదేవరపేట) ద్వితీయ, పర్యావరణం–వాతావరణమార్పుల విభాగంలో రౌతు సూర్యనారాయణ (జెడ్పీహెచ్‌ఎస్‌, మల్లవరం) ప్రథమ, ఎం.వెంకటేష్‌ (జెడ్పీహెచ్‌ఎస్‌ చివటం) ద్వితీయ, సాఫ్ట్‌వేర్‌ అం డ్‌యాప్స్‌ విభాగంలో డి.దీపిక (జెడ్పీజీహెచ్‌ఎస్‌,ధవళేశ్వరం) ప్రథమ, కె.వినూత్న (డాక్టర్‌బీఆర్‌ అంబేద్కర్‌ గురుకులం,గోపాలపురం) ద్వితీయ, ఆరోగ్యం–పరిశుభ్రత విభాగంలో ఎం.కృష్ణప్రసాద్‌ (జెడ్పీహెచ్‌ఎస్‌, లాలాచెరువు) ప్రథమ, టి.తేజశ్రీసాయి (ఏఎస్‌ఎన్‌ఆర్‌జెడ్పీహెచ్‌ఎస్‌,దేవరపల్లి) ద్వితీయ, పర్యావరణ హితం విభాగంలో ఎం.ఆషిక (జెడ్పీహెచ్‌ఎస్‌,రంగంపేట) ప్రథమ, ఎస్‌.సుమ (జెడ్పీహెచ్‌ఎస్‌,కొంతమూరు) ద్వితీయస్థానాలు సాధించారు.

కల్యాణం.. కమనీయం

- కన్నులపండువగా కుక్కుటేశ్వరస్వామి కల్యాణం
- భక్తులతో కిక్కిరిసిన పాదగయక్షేత్రం

పిఠాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామి కల్యాణం గురువారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. వేలాది మంది భక్త జనసందోహం నడుమ కుక్కుటేశ్వస్వామి, రాజరాజేశ్వరీదేవి అమ్మవార్ల పరిణయం ఆద్యంతం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం వేదపండితులు స్వామి, అమ్మవార్లను పెళ్లి



పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేశారు. అనంతరం స్థానిక శ్రీ రామకృష్ణ వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం వద్ద ఎదురు సన్నాహం నిర్వహించారు. గజవాహనంపై గ్రామోత్సవం అనంతరం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యాన పెండ్లి కుమారుడు కుక్కుటేశ్వరస్వామి, పెండ్లి కుమార్తె రాజరాజేశ్వరి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, సర్వాభరణాలతో అర్చకులు అలంకరించారు. స్వామివారిని, అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి రంగురంగుల విద్యుద్దీపాలు, పూల మాలికలతో సుందరంగా అలంకరించిన కల్యాణ వేదికపై అధిష్ఠింపజేశారు. రాత్రి 8.32 గంటలకు స్వామి వారి కల్యాణాన్ని వేద పండితుడు ద్విబాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనపాఠి ఆధ్వర్యాన పండితులు కన్నులపండువగా నిర్వహించారు. పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, సుముహూర్తం, కన్యాదానం, మంగళసూత్రధారణ, తలంబ్రాలు, ఆశీర్వచనం తదితర పూజాది కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆర్‌.సౌజన్య, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌ ఆకొండి ప్రభాకరరావు, ఆలయ సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- 2,500 వ్రతాల నిర్వహణ
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: మాఘ బహుళ ఏకాదశి సందర్భంగా రత్నగిరిపై సత్యదేవుని సన్నిధికి గురువారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచీ వేలాది మంది తరలి రావడంతో స్వామివారి ఆలయంతో పాటు వ్రత మండపాలు, ఆలయ ప్రాంగణం, విశ్రాంతి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రత్నగిరితో పాటు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవదంపతులు బంధుమిత్రులతో కలసి సత్యదేవుని ఆలయానికి వచ్చారు. దీంతో వ్రతమండపాలు, క్యూలైన్లలో నవదంపతుల సందడి నెలకొంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సత్యదేవుని ఆలయాన్ని తెల్లవారుజామున ఐదు గంటలకు తెరిచి భక్తులను దర్శనానికి అనుమతించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి వ్రతాల నిర్వహణ ప్రారంభించారు. స్వామివారి వ్రతాలు 2,500 జరిగాయి. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, సాధారణ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.

సత్యదేవునికి స్వర్ణ పుష్పార్చన

ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారికి ఉదయం ఏడు గంటలకు 108 స్వర్ణపుష్పాలతో అర్చన నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ లక్ష తులసి దళాలతో స్వామివారికి అర్చన చేశారు. అనంతరం వేదపండితులు స్వామి, అమ్మవార్లకు ప్రసాదాలు నివేదించారు.



స్వామివారి వ్రతాలాచరిస్తున్న భక్తులు

క్లుప్తంగా

కారు ఢీకొని తండ్రి, కుమారులకు తీవ్ర గాయాలు

పి.గన్నవరం: రాజవరం–పొదలాడ రోడ్డులో నాగుల్లంక గ్రామం వద్ద గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని కారు మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో నాలుగేళ్ల బాలుడితో సహా తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. కారును ఆపకుండా డ్రైవర్ పరారీ అయ్యాడు. క్షతగాత్రులను స్థానికులు రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పి.గన్నవరం ఎస్సై పి.గంగాభవాని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోలు గ్రామం దొరవారితోటకు చెందిన అమలదాసు వెంకటరమణ జగ్గన్నపేటలోని మెడ్‌ప్లస్ మెడికల్ షాపులో పనిచేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం పి.గన్నవరంలో జరిగిన వివాహ కార్యక్రమానికి తన నాలుగేళ్ల కుమారుడు నర్సింహులుతో కలిసి మోటారు సైకిల్‌పై పి.గన్నవరం వస్తున్నారు. నాగుల్లంక గ్రామం వద్ద ఈ ఘటన జరిగింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఇక విద్యోగం

- పాఠశాల విద్యలో మరో ముందడుగు
- వృత్తి విద్య బోధనకు చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 10 స్కూళ్ల ఎంపిక

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. విద్యార్థి కేంద్రంగా బోధన చేసేందుకు పలు విప్లవాత్మక, వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. విద్యార్థులు కళాశాల నుంచి బయటకు వెళ్లేటప్పటికి వారి కాళ్లపై వారు నిలబడే విధంగా పథకాలను అమలు చేస్తోంది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యాబోధన చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే తొమ్మిదో తరగతి విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేపట్టారు. ఈపీడీపీ (ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కింద ప్రతి శుక్రవారం వారికి తరగతులు నిర్వహిస్తూ యాజమాన్య మెళకువలను నేర్పుతున్నారు. ఇప్పుడు 6–8 తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వృత్తి విద్యబోధన అమలు చేసేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 10 పాఠశాలలను ఎంపిక చేశారు.

సన్నద్ధం చేసేది ఇలా..

పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల్లో అధిక శాతం వృత్తి విద్యా కోర్సులను ఎంపిక చేసుకుంటున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర ఉపాధి గ్యారంటీ కోర్సుల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం వృత్తి విద్యా కోర్సుల్లో చేరే విద్యార్థులను ముందస్తుగా సన్నద్ధం చేసే క్రమంలో భాగంగా పాఠశాల స్థాయిలో వృత్తి విద్యాబోధన అమలు చేసేందుకు నిర్ణయించింది. పని అనుభవం, ఉత్పాదకత పెంచే దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయడం, వివిధ రకాల వస్తువుల తయారీకి అవసరమైన పరికరాలు, యంత్రాలను గుర్తించడం, వాటిని ఎలా ఉపయోగించాలనేది విద్యార్థులకు నేర్పిస్తారు. చేతి పనులు చేయటంలో ప్రాథమిక నైపుణ్యాలు పెంపొందించడం, విద్యార్థుల్లో పరస్పర సహకారం, టీమ్ వర్క్‌ను అలవాటు చేస్తారు.



వృత్తి విద్య అమలు చేయనున్న అల్లవరం మండలం గోడిలోని గురుకుల పాఠశాల



పాఠశాల విద్యార్థులు

చేతి వృత్తులకు ప్రోత్సాహం

పాఠశాల స్థాయిలో వృత్తి విద్య అమలుకు తగిన ప్రణాళికలు గణితం, సైన్సు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు సిద్ధం చేస్తారు. పాఠశాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు, ప్రధానంగా చేతివృత్తుల కేంద్రాల సందర్శనకు విద్యార్థులను తీసుకువెళ్తారు. స్థానికంగా చేతి వృత్తులు చేసే నిపుణులను పాఠశాలలకు రప్పించి, వారితో విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తారు. చేతి వృత్తుల, పరిశ్రమల నిర్వహణదారులతో ముఖాముఖీ ఏర్పాటు చేస్తారు. తద్వారా 9–12 తరగతులు చదివే సమయానికి వృత్తి విద్యలో అనుభవం వచ్చేలా విద్యార్థులను సమాయత్త పర్చడం దీని ఉద్దేశం. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు ఇది దోహదపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఎంపిక చేసిన పాఠశాలలివీ..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

జెడ్పీహెచ్‌ఎస్ చెముడులంక, ఆలమూరు మండలం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఐఈఎస్(బాలురు), గోడి, అల్లవరం మండలం. జెడ్పీహెచ్‌ఎస్, సమనస, అమలాపురం మండలం.

తూర్పుగోదావరి జిల్లా

జెడ్పీ ఉన్నత పాఠశాలలు, శాటిలైట్ సిటీ, రాజమహేంద్రవరం రూరల్ మండలం, కడియం, గోకవరం.

కాకినాడ జిల్లా

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఏలేశ్వరం, కాకినాడ. ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, బాలికలు, చొల్లంగిపేట. తాళ్లరేవు మండలం

అమలుకు చర్యలు



ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో వృత్తి విద్య అమలుకు చర్యలు చేపడతాం. విద్యార్థి దశ నుంచే వృత్తి విద్యను పరిచయం చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఇది విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది.
– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

స్నేహితుడి భార్యను కాపాడబోయి యువకుడి మృతి



నరేంద్రకుమార్ (ఫైల్)

నిడదవోలు రూరల్: క్షణికావేశంలో కాలువలోకి దూకిన స్నేహితుడి భార్యను కాపాడబోయి ప్రమాదవశాత్తూ యువకుడు మృతిచెందినట్లు పట్టణ ఎస్సై పి.నాగరాజు గురువారం తెలిపారు. నిడదవోలు మండలం శెట్టిపేట గ్రామానికి చెందిన కాపకాయల నరేంద్రకుమార్ (31) గతంలో ఒక ప్రైవేట్ సెల్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసి ప్రస్తుతం వ్యవసాయ పనులు చేస్తున్నాడు. నరేంద్రకుమార్ స్నేహితుడు కొవ్వూరుకు చెందిన జావిద్ బాషా(చోటు)కు అతని భార్య దేవికి మనస్పర్థలు వచ్చాయి. దీంతో నరేంద్రకుమార్ భార్యాభర్తలను ఈ నెల 14వ తేదీన శెట్టిపేట తీసుకువచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. అయినా గొడవలు పెరగడంతో భార్య దేవి.. శెట్టిపేట పవర్‌ప్లాంట్ వద్ద బుధవారం తెల్లవారుజామున వంతెనపై నుంచి కాలువలోకి దూకేసింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో కాలువలోకి దిగిన నరేంద్రకుమార్ ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. కాలువలో గాలింపు చర్యలు చేపట్టగా నరేంద్రకుమార్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తల్లి నాగతులసీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత నిర్మలకుమారి ఆకస్మిక మృతి

- ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి
- పలువురు ప్రముఖుల నివాళి



నిర్మలకుమారి (పాతచిత్రం)

ఆలమూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ మాజీ అధ్యక్షురాలు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత కొల్లి నిర్మలకుమారి (47) గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆలమూరులోని ఆమె నివాసంలో నిద్రిస్తుండగా గురువారం తెల్లవారుజామున గుండెపోటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందారు. నిర్మలకుమారి భర్త రాజరత్నం మూడేళ్ల క్రితం గుండెపోటుతోనే మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2001–2006 మధ్య కాలంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ తరఫున జెడ్పీటీసీగా గెలిచి జెడ్పీ ప్రతిపక్ష నేతగా వ్యవహరించి ప్రజలకు సేవలందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర తొలి మహిళ అధ్యక్షురాలిగా ఆమె పనిచేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పలువురు ప్రముఖులు ఆమెకు ఘన నివాళులు అర్పించారు.

నిర్మలకుమారి మృతి తీరని లోటు

వైఎస్సార్ సీపీ మహిళ నేత నిర్మలకుమారి మృతి పార్టీకి, తమకు తీరని లోటని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి వ్యాఖ్యానించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఆమె పార్టీ అభ్యున్నతికి చేసిన కృషి మరువలేనిదన్నారు. మరణవార్త తెలుసుకున్న ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హుటాహుటిన ఆలమూరులోని ఆమె నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిర్మలకుమారి కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

రూ.3 లక్షల విలువైన 13 ఫోన్లు స్వాధీనం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వరుసగా సెల్‌ఫోన్లు అపహరిస్తున్న ఐదుగురిని రాజమహేంద్రవరం పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి దిశ పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరులకు ఆ వివరాలను వెల్లడించారు. ఇటీవల కాలంలో సెల్‌ఫోన్లు అధికంగా చోరీ అవుతున్నట్టు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఆ దిశగా దృష్టి సారించిన పోలీసులు చాకచక్యంగా సెల్‌ఫోన్ చోరీ బృందాన్ని పట్టుకున్నారు. పట్టుబడిన ఐదుగురిలో ఇద్దరు మైనర్లు కావడం గమనార్హం. స్థానిక ఐఎల్‌టీడీకి చెందిన జువ్వాది సూర్య సందీప్ అలియాస్ శాండీ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో చెడు వ్యసనాల బాట పట్టాడు. చేతిలో సొమ్ము లేకపోవడంతో నెహ్రూనగర్‌కు చెందిన శివశంకర్, బచ్చల జాన్, మరికొంత మందితో కలిసి సెల్‌ఫోన్లు తస్కరించడం మొదలు పెట్టాడు. తస్కరించిన వాటిని అమ్మితే టెక్నాలజీ ద్వారా పోలీసులకు వివరాలు తెలిసిపోయి దొరికిపోతామనే ఆలోచనతో వాటిని అమ్మకుండా తాకట్టు పెట్టేవారు. ఆ సొమ్ముతో మద్యం సేవిస్తూ, జల్సాలు చేసేవారు. తాకట్టుకు తీసుకున్న వ్యక్తి సెల్ ఆఫ్‌లో పెట్టి, తిరిగి తీసుకునే వరకు దాన్ని దాచేస్తున్నాడు. దీంతో వీరిని పట్టుకోవడం పోలీసులకు కొంత ఇబ్బందిగా మారింది. అయితే పోలీసులు మరింత ముందుకు వెళ్లి కేసును ఛేదించారు. సూర్యసందీప్, , బాల శివశంకర్, బచ్చల జాన్, ఇద్దరు మైనర్లను వలపన్ని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.13 లక్షల విలువైన 13 సెల్‌ఫోన్లు, మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించారు. మైనర్ నిందితులను జువైనల్ హోంకు తరలించారు. సమావేశంలో ఏఎస్పీలు జీవెంకటేశ్వరరావు, ఎం.రజని పాల్గొన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ప్రకాశ్‌నగర్ ఎస్సై ప్రేమ్‌రాజ్, పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- తొలిరోజు నామినేషన్లు నిల్
- 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- మార్చి 13న ఎన్నిక
- 16న ఓట్ల లెక్కింపు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి గురువారం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల అధికారి ఎస్.ఇలక్కియ నోటిఫికేషన్ విడుదల చేశారు. తొలిరోజు ఏ ఒక్కరూ నామినేషన్ దాఖలు చేయలేదు. ఈ నెల 23 తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు సమర్పించవచ్చు. 24వ తేదీన నామినేషన్ల పరిశీలన (స్క్రూట్నీ), 26, 27 తేదీల్లో ఉపసంహరణ ఉంటుంది. మార్చి 13న ఎన్నిక నిర్వహిస్తారు. 16న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని ఎన్నిక రిటర్నింగ్ అధికారి ఇలక్కియ వివరించారు. జిల్లాలో మొత్తం 1,436 మంది ఓటర్లు ఉండగా వీరిలో 640 మంది పురుషులు, 796 మంది మహిళలు ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికకు కాకినాడ, పెద్దాపురం, రాజమహేంద్రవరం, అమలాపురం, రామచంద్రపురం, రంపచోడవరం, ఎటపాక, కొత్తపేట రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో పోలింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు జేసీ ఇలక్కియ తెలిపారు.

సత్తా చాటిన గుమ్మిలేరు



గుమ్మిలేరులో నిర్వహించిన ఎడ్ల పరుగు పందెం



బహుమతులను అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

- ప్రథమ, ద్వితీయ అవార్డులు కైవసం
- ముగిసిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు
- విజేతలకు ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అవార్డుల ప్రదానం

ఆలమూరు: రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేల్లో ఆలమూరు మండలంలోని గుమ్మిలేరు మరొకసారి తన సత్తాను చాటింది. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అవార్డులను బహూకరించారు. స్థానిక వరహా కాలువ రోడ్డులో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సీనియర్, జూనియర్ విభాగాల్లో గురువారం నిర్వహించిన ఈ పోటీలను సర్పంచ్ గుణ్ణం రాంబాబు, కోరా వీరభద్రరావు గుణ్ణం శ్రీనివాసు, అముజూరు శ్రీనివాసు పర్యవేక్షించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 32 ఎడ్ల జతలు పాల్గొనగా అందులో 25 జతల ఎడ్లు సీనియర్ విభాగంలో పోటీ పడగా ఏడు జతల ఎడ్లు జూనియర్ విభాగంలో పోటీ పడ్డాయి. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జంతు ప్రేమికులు వచ్చి ఈ పోటీలను ఆసక్తిగా తిలకించారు. పోటీల్లో పాల్గొన్న ఎడ్ల యజమానులందరిని నిర్వాహకులు సత్కరించారు. ఎడ్ల పరుగు పందేల వద్ద ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో భారీ బందోబస్తు నిర్వహించారు. జిల్లా రైసుమిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య, రైసుమిల్లర్స్ వంటిపల్లి పాపారావు, వంక సత్యనారాయణ (అన్నవరం), వైట్ల దుర్గారావు, ముత్యాల భాస్కరరావు పాల్గొన్నారు.

విజేతలు వీరే

సీనియర్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరా శృతి చౌదరి ఎడ్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించగా సామర్లకోటకు చెందిన గుణ్ణం అనూరాధ ఎడ్లు తృతీయ స్థానం సాధించాయి. జూనియర్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరా శృతి చౌదరి (ప్రథమ), సామర్లకోటకు చెందిన గుణ్ణం అనూరాధ (ద్వితీయ) వల్లూరి వెంకట్రావు మెమోరియల్ దేవి అన్నపూర్ణ రైసుమిల్లు (తృతీయ), ధర్మవరానికి చెందిన దొడ్డిపట్ల రామగీతిక, లక్ష్మణ గోకుల (చతుర్థ), గండేపల్లికి చెందిన ఎల్.దుర్గ (పంచమ) స్థానాలు సాధించారు. ఎడ్ల పరుగు పందెం విజేతలను, నిర్వాహకులను ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అభినందించారు.

ఉత్సాహంగా హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న జాతీయ విమెన్ సీనియర్స్ హాకీ చాంపియన్ షిప్ పోటీలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. మొదటి మ్యాచ్ మహారాష్ట్ర హాకీ, పుదుచ్చేరి హాకీ మధ్య జరిగింది. మాజీ డీఎస్‌డీఓ మురళీధర్ క్రీడాకారిణులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు. మహారాష్ట్ర హాకీ జట్టు 7–0 స్కోర్‌తో విజయం సాధించింది. క్రీడాకారిణి మనషిరి నాగేంద్ర ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ఆడిటర్ రాంమోహన్ చేతుల మీదుగా అందుకుంది. రెండో మ్యాచ్‌లో హాకీ యూనిట్ ఆఫ్ తమిళనాడు, హాకీ అండమాన్ నికోబార్ జట్లు పోటీపడ్డాయి. 32–0 స్కోర్‌తో తమిళనాడు యూనిట్ జట్టు విజయం కైవసం చేసుకుంది. ప్రియంగ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్ చేతుల మీదుగా తీసుకుంది. గురువారం నిర్వహించిన మ్యాచ్‌లను హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ రాయ్, కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, ట్రెజరర్ పీటర్, టోర్నమెంట్ కో–ఆర్డినేటర్ వి.రవిరాజు, పరిశీలకుడు భూపేంద్రసింగ్, డైరెక్టర్ మహేష్, విక్రమ్ పర్యవేక్షించారు.



మ్యాచ్‌లో తలపడుతున్న తమిళనాడు– అండమాన్ నికోబార్ జట్లు

విచారణకు సహకరించని నర్సింగ్ స్కూళ్ల యజమానులు

కాకినాడ క్రైం: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎం) పరీక్షల మాస్ కాపీయింగ్‌తో కదలిన అవినీతి డొంకలో నిజాలు నిగ్గు తేల్చేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పడ్డ త్రిసభ్య కమిటీ తన విచారణ ప్రక్రియను వేగవంతం చేసింది. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్ చైర్మన్‌గా సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ పుష్కరరావు, ఏవో శ్రీనివాస్ సింగ్ సభ్యులుగా ఉన్న ఈ కమిటీ ఇచ్చిన ముందస్తు షెడ్యూల్ ప్రకారం గురువారం సుమారు 25 నర్సింగ్ స్కూళ్ల యజమానులు విచారణకు హాజరుకావలసి ఉంది. అయితే 10 కళాశాలల యజమానులు మాత్రమే విచారణకు వచ్చారు. విచారణ సమయం ముగుస్తుండడంతో ఫోన్లు చేసి పిలిచినా స్పందించలేదు. హాజరుకాని వారి జాబితాను విచారణ కమిటీ ప్రత్యేకంగా సిద్ధం చేసింది. పలు నర్సింగ్ స్కూళ్ల నుంచి లంచాలు తీసుకొని మాస్ కాపీయింగ్‌కు లోపాయికారీ అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు ఎదుర్కొంటూ, ఉన్నతాధికారుల ప్రాథమిక చర్యలకు గురైన జీజీహెచ్ జూనియర్ అసిస్టెంట్ కొండేపూడి శేఖర్ వైఖరి కమిటీ సభ్యుల్ని తీవ్ర అసంతృప్తికి గురి చేసింది. జీజీహెచ్‌లో విధుల్లో ఉండి కూడా విచారణ సమయం ముగిశాక, మధ్యాహ్నం ఒంటి గంటకు ఉద్దేశపూర్వకంగానే ఆలస్యంగా హాజరవడంతో కమిటీ సభ్యులు ఇదేం నిర్లక్ష్యం అంటూ మండిపడ్డారు. వెళ్లిపొండంటూ తిరిగి పంపేశారు. విచారణకు వచ్చిన నర్సింగ్ స్కూళ్ల ప్రతినిధుల నుంచి పలు ప్రశ్నలకు లిఖిత పూర్వక వివరణ తీసుకున్నారు. ఆ వివరణ పత్రంతోపాటు విచారణకు హాజరుకాని స్కూళ్ల వివరాలు, విధుల్లో ఉండి కూడా విచారణకు హాజరుకాని శేఖర్ పేరును జత చేస్తూ కమిటీ బృందం విచారణ నివేదికను సిద్ధం చేసినట్టు జీజీహెచ్ ఉన్నతాధికారులు తెలిపారు. నివేదికను సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు పంపనున్నారు.

కోర్టులో దొంగతనం

కాకినాడ క్రైం: కాకినాడ కోర్టులో దొంగతనం జరగడం కలకలం రేపింది. కోర్టుల ప్రాంగణంలో పలు న్యాయస్థానాల్లో జడ్జిల రూంలను అనుసంధానం చేసి ఉన్న ఏసీల కాపర్ వైర్లను ఆగంతకులు కత్తిరించి ఎత్తుకెళ్లారు. నాల్గవ అదనపు జిల్లా కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మొబైల్ మెజిస్ట్రేట్ కోర్టుల ఏసీల కాపర్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో జిల్లా కోర్టు సూపరింటెండెంట్ చేసిన ఫిర్యాదు మేరకు కాకినాడ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారం రోజుల వ్యవధిలో ఈ దొంగతనాలు చోటు చేసుకున్నట్లు భావిస్తున్నామని పోలీసులు తెలియజేశారు. కాపర్ వైర్ల చోరీల నేపథ్యంలో పాడైన ఏసీలకు అధికారులు మరమ్మతులు చేయించారు.